# చిన్న కారు

దబాటువాన కురిసి వెలిసిన తర్వాత పరమేశంగారు ఆఫీసు నుంచి యింటికి బయలుదేరారు. నడిచే వెళుతున్నారు పేవ్‌మెంటుమీద నుంచి. రోడ్డుమీద బస్సులు, చిన్నకార్లు, లారీలు, బళ్ళు అనేకం పరుగెత్తుకు పోతున్నాయి. పరమేశంగారు మాత్రం నిమ్మదిగా వెళ్తున్నారు.

ఒక చిన్నకారు మంచి వేగంగా పోతోంది. రోడ్డుమీద గుంటల్లో నిల్చిన నీరు దూరంగా చిందుతోంది. పక్కనుంచి పోతున్నప్పుడు చిన్నకారు రంయిమని నీరు చిమ్మింది- పరమేశంగారి తెల్లబట్టలనిండా నీరు పడింది- అదిచూసి తన చిన్నకారు ఆపాడు ఆసామి-

పరమేశంగారు పెద్ద ఆఫీసరు- చిన్నకారు కొనడం ఆయనకు కష్టమైనపనికాదు. కాని ఆయన చిన్నకారు అసలు కొననే కొనడు-

నడిచే ఆఫీసుకు వెళ్ళిపస్తారు - నీరు చిందకొట్టిన చిన్నకారు ఆసామి "ఎక్స్యూజ్ మీ సార్!.... రండి మీయింటి దగ్గర దిగబెడతాను" అన్నారు- కొంత పరిచయం వుండడంవల్ల-

కాని పరమేశంగారు "నెవర్ మైండ్ నడిచే వెళ్తానండి దగ్గరే" అన్నారు-

చిన్నకారు వెళ్ళిపోయింది- పరమేశంగారి మనస్సులో ఏదో మెదిలింది- కళ్ళలో నీళ్ళు నిండాయి. ఆనీటి తెరమీద గతంలోని ఒక విషాద చిత్రం ప్రతిబింబించింది-

పరమేశం చిన్న గుమాస్తా- పిత్రార్జితం ఎకరమో కుంటో వుంటే అది కాస్తా హరించింది- రెక్కలే అతని ఆధారం- బి.యే.ప్యాసయ్యాడు. అదే జీవితంలో గొప్ప అదృష్టం అనుకున్నాడు- అసలు స్కూలుఫైనలు తోనే చదువుకు స్వస్తి చెప్పవలసి వస్తుందని చాలా భయపడ్డాడు- కాని సరస్వతీ కటాక్షం వుండబట్టి లక్ష్మీదేవి చిన్నచూపు చూసినా పట్టభద్రుడు కాగలిగాడు-బి-ఏ-రెండో సంవత్సరంలోనే వుండగా సర్వీసు కమీషనుకు కూర్చున్నాడు- చిన్న గుమాస్తా ఉద్యోగం యిచ్చారు- జీవితం గడిపేం దుకు మార్గం లభించిందనుకున్నాడు-

తన తాహతుకుతగ్గ సంబంధం చేసుకున్నాడు - ఉన్నంతలో సంసారం గుట్టుగా జరిగిపోతోంది-

పండువంటి కొడుకు పుట్టాడు. భోగభాగ్యాలతో కాకపోయినా తన కొడుకు బుజ్జికి ఏ కొరతా లేకుండా పెంచుతున్నాడు-

అయిదోఏట బుజ్జిని స్కూల్లో చేర్చాడు. బుజ్జి రెండోతరగతిలోకి వచ్చాడు.

పరమేశం కొడుకుని రోజూ స్కూలుకి దిగబెట్టి వచ్చేవాడు. బుజ్జి వచ్చేటప్పుడు స్నేహితులతో కలిసివచ్చేవాడు.

బుజ్జితోపాటు చదువుకునేవాళ్ళలో చాలామంది పెద్ద పెద్ద ఆఫీసర్ల పిల్లలున్నారు. రంగురంగుల చిన్నకార్లలో వాళ్ళని దిగబెట్టి వెళ్తారు. బుజ్జి

ఆ కార్లను ఎంతో సంబరంతో చూసేవాడు, దగ్గరకువెళ్ళి ముట్టుకుని మురిసిపోయేవాడు.

బుజ్జి చిన్నారితలలో ఒక ఆలోచన తట్టింది. తాను కూడా హాయిగా అలాంటి చిన్నకారులో స్కూలుకువస్తే ఎంత బాగుంటుందని అనుకున్నాడు. అసలు చిన్నకారులో రాకుండా యింటిదగ్గర నుంచి ఎందుకు నడిచి రావాలో బుజ్జికి అర్థంకాలేదు. ఇంతవరకు నాన్నని చిన్నకారు అడగకపోవడం తన పొరపాటే అనుకున్నాడు. అడిగితే యీపాటికి నాన్న తప్పకుండా చిన్నకారు కొనితీరేవాడని బుజ్జి నమ్మకం. ఏమైనాసరే నాన్నను కారు కొనమని అడగాలనుకున్నాడు.

ఒకనాడు పరమేశం ఆఫీసునుంచి రాగానే బుజ్జి, 'నాన్నా! మరి బళ్ళో అబ్బాయిలు చిన్నకారు ఎక్కివస్తారు- నేగూడా చిన్నకార్లో వెళ్తే బలే బాగుంటుందిగదూ! మనకి కూడా ఒక చిన్నకారు కొను నాన్నా!' అని అడిగాడు-

తక్షణం ఏమి జవాబు చెప్పాలో పరమేశానికి తట్టలేదు- ఏదో జవాబు చెప్పడం అవసరం-

"చిన్నకారా! నడిచివెళ్ళితే బాగుండదా?" అన్నాడు-

"నడిచెందుకు నాన్నా! చిన్నకారయితే జోరుగా పరుగెత్తుకు పోతుంది. కారు కొనునాన్నా నీ జీతం రాంగానే" అన్నాడు-

'ఏరా! మరి నా జీతం యెంతో నీకు తెలుసా?' అని ప్రశ్నించాడు కొడుకుని పరమేశం నవ్వుతూ-

'ఆ! తెలుసు- బోలెడు రూపాయలు తెస్తావుగా!' అన్నాడు బుజ్జి సగర్వంగా-

తండ్రి తెచ్చే స్వల్పజీతమే బోలెడు రూపాయిలుగా కల్పించాయి ఆ చిన్నికళ్ళకు-

'మరి చిన్నకారు ఎంతో తెలుసునా?' అన్నాడు పరమేశం-

'బజారులో అడిగితే చెబుతారు- డబ్బులిచ్చి మన యింటికి తెచ్చుకో

వచ్చు - అంతే' అన్నాడు బుజ్జీ చాలా తేలికగా సమస్య పరిష్కరించినట్టు- "సరేలే" అన్నాడు పరమేశం, అంతకన్నా కొడుక్కి చెప్ప డానికి మార్గంలేక.

బుజ్జిమాత్రం ఆనాటినుంచి మహాసరదాగా ఉంటున్నాడు చిన్నకారు రాబోతుందని, మనసులో రకరకాల కార్యక్రమాలు వేసుకుంటున్నాడు చిన్నకారులో ఎక్కడెక్కడికి వెళ్ళవలసిందీ- చిన్నకారు గురించి అద్భుత మైన కలలు కంటున్నాడు.

తన తోటివిద్యార్థులందరికీ చెప్పాడు చిన్న కారు సంగతి - కొందరు నవ్వారు.

ఎప్పుడు తండ్రికి జీతం వస్తుందా అని గంటలు లెక్కపెడు తున్నాడు - మొదటి తేదీ సమీపిస్తున్నకొద్దీ బుజ్జి సంతోషం ఎక్కువవు తోంది-

మొదటి తేదీ వచ్చింది. తండ్రి జీతం తెచ్చాడు.

"నాన్నా! బజారుకెళ్ళి కారు కొనుకొద్దామా" అని అడిగాడు బుజ్జి.

పరమేశం నవ్వి "తర్వాత కొంటాను" అన్నాడు.

"ఎప్పుడు కొంటావు నాన్నా!" అని తిరిగి అడిగాడు బుజ్జి.

"నే తెస్తాగా" అన్నాడు పరమేశం.

అప్పటికి కొంత నిరుత్సాహం కలిగినా, తండ్రి తప్పకుండా కారు కొంటాడన్న ధైర్యం మాత్రం వుంది బుజ్జికి.

రోజులు గడిచిపోతున్నాయి. బుజ్జి అనుకున్నట్లు పరమేశం కారు కొనలేదు, తిండి గడవడమే కష్టం అవుతోందన్న సంగతి బుజ్జికి ఏం తెలుసు! బుజ్జి ధ్యాసమాత్రం రాత్రింబవళ్ళు చిన్న కారు మీదే. ఎన్నో గాలి మేడలు కట్టుకుంటున్నాడు, రాత్రిపూట నిద్రలో చిన్న కారు గురించి ఏవేవో మాట్లాడుతూ తెగ కలవరిస్తున్నాడు.

ప్రతి రోజూ తండ్రిని కారు గురించి అడుగుతూనే వున్నాడు, తనని చిన్నకారులో స్కూలికి దిగబెట్టమని అంటున్నాడు.

స్నేహితులు "ఇంకా మీ నాన్న చిన్నకారు కొనలేదూ? ఇంకో నడిచే వస్తున్నావేం" అనే ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు-

ఇవన్నీ తండ్రికి చెప్తున్నాడు-

నానాటికి బుజ్జికి కారు గొడవ పెరిగిపోతోంది- పరమేశానికిది సమస్యగా పరిణమించింది-

ఒక వుపాయం తట్టింది పరమేశానికి-

మర్నాడు స్కూలు వేళకి ఒక టాక్సీ తీసుకొచ్చాడు - బుజ్జి ఆనందానికి అంతులేదు- గబగబా వచ్చి ఆ టాక్సీలో ఎక్కాడు- ఆకారు అంతా పరీక్షగా చూశాడు-

ఆనాడు టాక్సీమీద స్కూలుకు వెళ్ళాడు- స్నేహితులందరితో తండ్రి చిన్నకారు కొన్నాడని చెప్పాడు-

ఇంటికి సాయింత్రం పరుగెత్తుకొచ్చాడు. ఇంటి దగ్గర చిన్నకారు లేదు- తండ్రి వచ్చాక చిన్నకారు సంగతి అడిగాడు-

రాత్రి పూట ఎక్కడో దాయాలని చెప్పి ఒప్పించాడు పరమేశం-

మర్నాడు వుదయం స్కూలుకు వెళ్ళేందుకు గబగబా ముస్తాబయ్యాడు- కాని చిన్నకారు లేదు- తండ్రి వెంటబెట్టుకుని నడిపించి తీసుకెళ్ళాడు. చిన్నకారు చెడిపోయింది- డ్రయివరు బాగుచేసి తీసుకొస్తాడు అని బుజ్జికి నచ్చ చెప్పాడు.

రెండు రోజులు బుజ్జికి అతికష్టంమీద గడిచాయి. ఈ రెండు రోజులుతమ చిన్నకారు కళ్ళలో మెదుల్తూనే వుంది - తిరిగి చిన్నకారు ఎప్పుడు వస్తుందా అని వువ్విళ్ళూరుతున్నాడు. తమ చిన్నకారు పోలికలన్నీ వాడికి బాగా తెలుసు-

మూడోనాడు తండ్రివెంట స్కూలుకు వెళ్తున్నాడు బుజ్జి- లోగడ తండ్రి తెచ్చిన టాక్సీ ఎదురుగా వస్తోంది. తమ చిన్న కారు అదేనని చూసీచూడంగానే గుర్తుపట్టాడు. సంతోషం భరించలేకపోయాడు.

"నాన్నా! అదిగో మన చిన్నకారు!" అని కేకవేసి ఆ టాక్సీకి

అడ్డంగా వెళ్ళాడు. చక్రం క్రింద పడ్డాడు. పరమేశం గొల్లున ఏడ్చాడు. జనం పోగయ్యారు.

ఆ టాక్సీలోనే పెద్దాసుపత్రికి తీసుకెళ్ళారు బుజ్జిని- గాయం బలంగా తగిలింది. ఇంటికి కబురంపి తల్లిని రప్పించారు- తల్లి శోకం చెప్పడం యెవరితరం?

బుజ్జికి స్పృహలేదు- చిన్నకారు గురించి పిచ్చి పిచ్చి మాటలు వినపడీ వినపడకుండా మాట్లాడుతున్నాడు.

ఆ సాయంకాలానికి బుజ్జి తల్లి తండ్రుల్ని దుఃఖసాగరంలో వదిలి శాశ్వతంగా వెళ్ళిపోయాడు.

పరమేశం దంపతులకు ఆ జన్మాంతం ఆరని బడబానలంవంటి బాధ మిగిలింది. పరమేశంగారి కిది తీవ్రమైన శిక్ష- ఆ పసి హృదయంలో అనవసరంగా ఆశలు కల్పించి, వాటిని పెంపొందించాడు- భగవంతుడు ఈ అకృత్యానికి ఇంత పెద్ద శిక్ష విధిస్తాడని తను భావించ లేదు-

ఈనాటికి తను పెద్ద ఆఫీసరయ్యాడు- ఇంత సంపాదిస్తున్నావు ఒక కారయినా కొనలేవుటయ్యా అని మిత్రులు అప్పుడప్పుడంటూ వుంటారు.... కాని తానెలా కారు కొనగలడు? కారుమీద మమతకు తన చిన్నారి బుజ్జి ఆహుతైపోయాడు- ఈ సంగతి యెవరికి తెలుస్తుంది?

పరమేశంగారు ఇల్లు చేరుకున్నారు- ఎదురుగా నవ్వులు కురిపిస్తున్న బుజ్జి ఫోటో వుంది- ఆ ఫోటో చూడగానే పరమేశంగారికి కన్నీళ్ళు కారడం మొదలుపెట్టాయి. *

(1957)